# నచ్చినోడు

ప్రొద్దు జారిపోయింది. నిమ్మ చీకట్లు ముసురుకొంటున్నాయి. పూర్ణ గర్భిణిలాగా నిండుగా - నిశ్చలంగా వున్న బోగంసాని యేరులో పుడిసెడు నీళ్ళు త్రాగి, తడిసిన రెక్కలను తపతపలాడించుకుంటూ తెల్లకొంగలగుంపు ఒక్కసారిగా పైకి లేచి, - నిశాదేవి మెడలో మల్లెదండల బారులు లాగా - ఎటో ఎగిరిపోయాయి.

నాగరత్తం గడ్డిమోపు నెత్తిమీద పెట్టుకొని గబగబ నడుస్తోంది. ఇవాళ మరీ ఆలస్యం అయింది; ఈపాటికి అక్కడ మోపులన్నీ అమ్ముడుపోయి వుంటాయి. ఏం ధర పడుతుందో ఏమిటో?-అని అనుకొంటూ, వరిమాగాణులు దాటి, రోడ్డున పడింది. మళ్ళీ నా మోపుకు ధర రాకపోతే, ఇంకెవ్వరు మోపు కొస్తుందిలే అని అనుకొని, తృప్తిగా నవ్వుకుంది.

ఇవాళ చలపతిగాడు అడ్డగించకపోతే ఇంత జాగయ్యేది కాదు. అడ్డగించాడంటే, మరి అడ్డగించడు? ఏ రోజుకారోజు డబ్బులు ఇయ్యకుండానే ఆడి తోటలో గడ్డి కోస్తున్నా. అందరి దగ్గరా రకాయించి బేడ బేడ చొప్పున వసూలు చేస్తోన్నాడు. రోజూ తియ్యటి కబుర్లు చెప్తుతుంటే, చల్లబడి ఊరుకుంటున్నాడు. మరీయాళ ఆడికేంవచ్చిందో ఏమిటో? బేడ ఇస్తేనేకాని గడ్డికోయటానికి వీలులేదని అటకాయించాడు. వచ్చే పరణాల డబ్బుల్లో వీడికి బేడిస్తే - ఇంక నూకలు, పై ఖర్చులమాట? సీతాలు, లచ్చోళ్లు మోపులెత్తుకుపోయి చాలాసేపయింది; ఈ పాటికి మోపులమ్ముకొని, బయలుదేరి వుంటారు. ఇంతకి ఆ చలపాయిగాడు చేశాడు. 'బేడన్నా ఇయ్యి-లేకపోతే......' అంటూ చెయ్యిపట్టుకున్నాడా సచ్చినోడు. ఆడ్ని బులిపించి వప్పించేతలికి సచ్చినంత పనైంది. ఏంటో ఈ మొగాళ్ళు ముందు పొడిచేటట్లు మాటాడుతారు. తీరా ఆడదాని చెంగు తగిలితే సల్లబడి, జావలాగా జారిపోతారు. ఈ వెర్రిమొగాల మొగోళ్లు!

ఇలా అనుకుంటూ రైలుకట్ట దగ్గరకొచ్చింది నాగరత్తం. అప్పుడే గొలుసు అడ్డంగా కట్టాడు ఆ కాకిబట్టలు వెంకాయగాడు.

"ఈ బండి ఇప్పుడే సావాలా?" అని తిట్టుకుంటూ మోపు కిందపడవేసింది. వెంకాయగాడు పచ్చదీపం పట్టుకుని అటుఇటు ఊపుతూ నాగరత్తం మొగం వైపు చూపించాడు. కళ్ళకు చేతులు అడ్డుపెట్టుకొని, దీపం వెలుగు మొగాన తాకకుండా ఆపింది. బండి బడ బడ వెళ్ళిపోయింది.

వెంకాయ నవ్వుతూ "ఇయాళ ఇంత ఆలస్యం అయిందేమే నాగులూ?" అన్నాడు.

"అయిందిగాని, గొలుసు తీయ్ వెర్రిమొగమా?" అంటూ నాగరత్తం మోపు నెత్తిన ఎత్తుకోబోయింది.

వెంకాయి చెయ్యేసి మోపు ఎత్తాడు. నాగరత్తం భుజం పట్టుకొని ఇలా అన్నాడు.

"ఇవాళ రేపు అంటూ రోజులు గడవటమేగాని నా వూసే నీకు పట్టడంలా."

"సరేగాని, గొలుసు తప్పించు."

"ఇంతకి నా మనస్సు తీర్చే దెప్పుడే?" అంటూ చేయి పట్టుకున్నాడు.

"ఎల్లుండి - ఏకాదశినాడు-"

చేయివిసిరికొట్టి, వయ్యారంగా గేటుదగ్గరకొచ్చింది. వెంకాయ గొలుసు లాగాడు.

నాగరత్తం కట్టదాటి, రెండు అడుగులు వేసి ఆగి,

"పువాకు కాడుంటే ఒకటియ్యరా!" అంది.

వెంకాయ బొడ్లోంనుంచి రెండు కాడలు తీసి, నాగరత్తానికి ఇస్తూ, "అసేయ్ ఈయాళ మనయవ్వారం తేలాల్సిందే! ఈడే కాసివుంటా - నీవు సరుకులు తీసుకొని గూడేనికి పోయేటప్పుడు- తప్పదు-" అన్నాడు.

"సడేలేవోయ్ టెంకాయ్." అంటూ, ఆడిచేతిలోని కాడలు లాక్కొని, వయ్యారంగా ముందుకు సాగిపోయింది.

ఈ వెంకాయగాడికి ఇంకా పెండ్లి కాలా. తండ్రి ముసిలోడు అవటంతో, ఆ రైలు గేటుకాడ ఉద్యోగం వీడికొచ్చింది. తల్లి వీడి చిన్నతనంలోనే చచ్చిపోయింది. తండ్రికూడా ఇవాళ, రేపు అన్నట్టుగా ఉన్నాడు. వెంకాయికి గడ్డిమోపుల వాళ్ళందరు పరిచయమే! అసలు నాగరత్తాన్ని వాడే మనువు చేసుకుందాం అనుకున్నాడు. కాని అది వాళ్ళ గూడెంలో మరొకడికి మనస్సిచ్చి వాడ్నే కట్టుకుంది. ఐనా, వెంకాయి ఇప్పటికీ నాగరత్తం వెంటపడటం మానలా. అదంటే వాడికి చెప్పలేనంత మోజు. అది ఏమడిగినా కాదనక లేదనక ఇచ్చేస్తాడు.

నాగరత్తం వీడి విషయంలో అవును అనదు; కాదనదు. ఇదిగో రేపు, మాపు అని గడుపుకొస్తుంది. దాని మిడిసిపోయే అందంముందు, గుండెలను వడిసికొట్టే చిరునగవు ముందు - వెంకాయిగాడు ఎప్పుడూ తలవంచవల్సిందే! వాడు రోజుకు రెండు మూడు పువాకు కాడలు, పండుగలకు పబ్బాలకు గాజుల డబ్బులు, అప్పుడప్పుడు సినిమాఖర్చులు సమర్పించుకుంటున్నాడు. నాగరత్తం ఊరించి మురిపిస్తోందేగాని, వీడి మోజు తీర్చటం లేదు.

నాగరత్తం ఊళ్ళోకి వచ్చేసరికి, అక్కడ మోపులన్నీ అమ్ముడుపోయాయి; కొనేవాళ్ళు కూడా ఎవరూ లేరు. నాగరత్తం మోపు దించుకొని, లైటు స్తంభానికి ఆనుకొని నిల్చుంది. చెదిరిన వెంట్రుకలను మునిగోళ్ళతో సరిచేసికొని, చెంపపిన్నులను ఊడదీసి మరల పెట్టుకుంది.

ఎదురుగుండా దిగాలుమంటున్న గంగానమ్మ రావిచెట్టువంక చూచింది. ఆరోజు ఆలస్యానికి కారకుడైన చలపతిని మళ్ళీ ఒకసారి మనస్సులో తిట్టుకుంది. ప్రతిరోజు తన మోపు దింపగానే

విటగాండ్లందరు చుట్టేసేవాళ్ళు. వాళ్ళతో సరాగాలు, పరాచికాలు ఆడుతుంటే, మోపుధరకు తనకు తెలియకుండానే పెరిగిపోతుండేది. మిడిసిపోయే నాగరత్తం అందం, సరసాలు అందర్నీ ఆకర్షిస్తాయి. అందువల్లే అది తెచ్చే గడ్డి మంచిది కాకపోయినా, దానిమోపుకు అందరి మోపులకంటే ఎక్కువ ధర పడుతుంది.

వచ్చి అరగంటైనా మోపు అడిగేవాళ్ళే కన్పించలేదు. ఇక - ఇవాళకి మోపు ఎత్తుకొని ఇంటికి పోవాల్సిందే అని అనుకొంటున్న సమయంలో ఒక యువకుడు అక్కడి కొచ్చాడు. అతడ్ని చూచి నాగరత్తం చిరునవ్వు నవ్వింది; ఆ నవ్వు తంగేడిపూలు పూచినట్లుంది. వీధి దీపం కాంతిపడి నాగరత్తం నల్లటి చెంప తళతళ లాడింది. ఆ నున్నటి చెంప తళతళలు చూడగానే ఆ యువకుని హృదయం కలకలలాడింది.

"ఏఁవండి మోపు కావాలా?" అడిగింది నాగరత్తం.

"ఊఁ- ఎంతకేస్తావు?" అని అడిగాడు.

"పదణాలు - మంచిగడ్డి-"

"సరే, ఎత్తుకో-"

ఇద్దరూ శివాలయం వీధివైపుగా పోయారు. ఆ యువకుడు బ్రాహ్మల కుఱ్ఱాడు. ఈ ఊరి హైస్కూలులో ఎస్సెస్సెల్సీ చదువుతన్నాడు; పేరు రామారావు. యౌవనం వికసించే తొలిదినాలు! ఆడదాని అందం చూడగానే, హృదయంలో గడబిడ కలిగే మధురదినాలు అవి! ప్రతిరోజా నాగరత్తాన్ని చూడంది ఉండలేదు. ఎక్కువగా నాగరత్తం మోపులే కొంటాడు. మనస్సు విప్పి చెప్పలేక మధనపడుతున్నాడు. ఇదంతా నాగరత్తానికి తెలుసు. తన అందం పందెంలో ఆ అమాయకుడ్ని ఒక ఆట ఆడిస్తోంది.

గొడ్లసావిట్లో మోపుపడేసి, తలవాకిట్లోకి వచ్చింది. అక్కడ నైట్‌క్వీన్‌పూలు నక్షత్రకాంతిలో తళతళలాడుతూ, గాలిలో సువాసనలను కలుపుతున్నాయి. నాగరత్తం ఎగిరెగిరి ఒక పూలగుత్తిని కోసింది; అంతకుముందు తన తలలో వాడిపోయిన తంగేడుపూలుతీసి అవతల పారేసి, ఈ గుత్తిని పెట్టుకుంది. ఇదంతా రామారావు చూస్తూనే వున్నాడు. అర్థంకాన్ని తియ్యటి ఉద్వేగంతో ఊగిపోతున్నాడు.

"ఏంటి అట్టా సూస్తున్నారు? డబ్బు లిప్పించండి" అంది.

రూపాయిబిళ్ళ ఇచ్చాడు. దాన్ని తీసుకొంటూ. తన చేతి వేళ్ళను రామారావు చేతికి తాకించింది. ఈ తాకిడికి అతడు ఉక్కిరిబిక్కిరై పోయాడు.

"నాదగ్గర సిల్లర డబ్బులు లేవండి." తిక్కిరి, బిక్కిరి చూపులు చూస్తూ, వంకర నవ్వులు నవ్వింది.

ఫర్వాలేదులే - ఉంచుకో-" తడి ఆరుతున్న గొంతుతో అన్నాడు.

నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. చేతిలోని కఱ్ఱత్రిప్పుకుంటూ, వయ్యారంగా వెళ్ళుతున్న నాగరత్తాన్ని వీధి మలుపు తిరిగేవరకూ చూస్తూ నిల్చున్నాడు ఆ స్టూడెంటు కుఱ్ఱోడు.

★ ★ ★

తొందర తొందరగా నడుస్తూ షావుకారు చెంగయ్య కొట్టు కెళ్ళింది - సరుకులు కొనుక్కోటానికి. అప్పుడు కొట్టుమీద షావుకారు కొడుకు సుబ్బారాయుడు ఉన్నాడు.

నాగరత్తాన్ని చూడగానే ఏనుగు గున్నంత ఉన్న సుబ్బారాయుడు - సంతోషంతో అంతకంతయ్యాడు.

"ఏమే నాగరత్తం ఇవాళ ఇంత ఆలస్యంగా వచ్చావే? మీ వాళ్లందరూ వెళ్లి జాము సేపైందిగా?" అన్నాడు.

"అయిందిలేగాని, శేరు నూకలు పొయ్." అంటూ చెంగుపట్టి, సుబ్బారాయుడివంక ములుకుల్లాంటి చూపులు విసురుతూ కులికింది. రాయుడు గుండె కాస్తా కలుక్కుమంది.

"నూకలకూడు ఏం తింటావు నీ బొంద? పట్టు-" ఒకటో నెంబరు వంకసన్నాలు- శేరు ముప్పావలారకం- పోశాడు.

బియ్యంపోసి, భుజం పట్టుకొని, "రెండో ఆటకు సినిమాడేరా కొస్తావా?" అన్నాడు.

నాగరత్తం ముద్దుగా మూల్గి,చేయి విసిరికొట్టి, "అదిగో, మీ అయ్యా వస్తోన్నాడు-" అంది.

సుబ్బారాయుడు భయంతో వణికిపోయాడు. సర్దుకు కూర్చొని, గట్టిగా "ఇంకేం కావాలో చెప్పవమ్మా-" మామూలు వ్యాపార కంఠంతో అన్నాడు.

నాగరత్తం పకపక నవ్వి, "ఓరి నీభయం దొంగలు తోలా-" అంది.

సుబ్బారాయుడు వెనక్కు తిరిగి చూశాడు. నల్లమొగం తెల్లబడింది. "బలేదానివే-నిజంగానే మా అయ్యవస్తోన్నాడేమోనని హడలి సచ్చాను" అన్నాడు.

నాగరత్తం విరగబడి నవ్వుతుంది. సుబ్బారాయుడుకు ఆనవ్వు చిల్లరడబ్బుల సంచిని ఇనప్పెట్టెలో గుమ్మరించి నట్లుంది. అడక్కుండానే ఇంకా ఉప్పు, పప్పు, మిరప కాయలు - ఇవి, అవి అన్నీ చెంగులో పడేశాడు.

ఇంతలో నిజంగానే షావుకారు చెంగయ్య వచ్చాడు. సుబ్బారాయుడు గప్‌చిప్. నాగరత్తం చెంగయ్యకు సరికొత్త నవ్వు విసిరింది. చెంగయ్య నాలికతో పెదిమలు తడుపుకున్నాడు. ఇటువైపు చూశాడు. కొడుకు దిష్టిబొమ్మలాగా కన్పించాడు.

"ఏంరా గరటాలుకు రెండు ఉప్పుకట్టలు వెయ్యమన్నా - మరి వేశావా?"

"ఓ! జాంసేపైంది."

"మరి పైకమో?"

"ఇయ్యాలా, సందకాడ రమ్మన్నాడు."

"మరింకా కూసున్నావుంరా వెర్రి మొగమా! వెళ్ళి వసూలు చేసుకురాక - ఊఁ వెళ్ళు," అన్నాడు.

సుబ్బారాయుడు వాళ్ళ అయ్యవంక, నాగరత్తం వంక చూస్తూ, గొణుక్కొంటూ అయిష్టంగా గల్లాదగ్గర నుండి లేచాడు.

చెంగయ్య వళ్ళు అంతా కళ్ళుచేసుకొని, నాగరత్తం వంక చూస్తూ, "దీనికి వెచ్చం ఎంత ఇచ్చావ్" అన్నాడు.

సుబ్బారాయుడు కాసేపు బుఱ్ఱ గోక్కొని, "ఆఁ ఎంత - బేడకానిది" అని బయటికి వెళ్ళాడు.

ఈ మాటవిని నవ్వుకుంది. రూపాయి యిస్తూ; "మీ డబ్బులు తీసికొని, మిగిలిన డబ్బు లిప్పించండి" అంది.

"నీ దగ్గర బేడకానీ తీసికోమంటావా వెఱ్ఱిమొగమా?"

"ఈ ఉట్టుట్టి మాటలుకేం వచ్చెగాని - డబ్బులు తీసుకో-" పెడసరంగా అంది.

"ఉట్టుట్టిమాట లేందే వెఱ్ఱిమొగమా? నీకేం గావాలో చెప్పు. పట్టికబెల్లం పెట్టనా?"

"పటికబెల్లం వద్దు. ఇటికబెల్లం వద్దు. నేను పోతుండా-" అంటూ రూపాయిబిళ్ళను మళ్ళా రొంటిని దోపింది.

"అట్ట దులిపేసుకు పోతావేంటే వెఱ్ఱిమొగమా? ఇదిగో ఈ సబ్బుబిళ్ళ తీసికో. మాంచి సువాసనగా వుంటుంది. నీవంటికి రుద్దుకో" అంటూ లక్సు సబ్బు ఒకటి ఇచ్చాడు.

నాగరత్తం సబ్బు తీసికొని, కళ్ళతో నవ్వి, వయ్యారంగా వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతున్న నాగరత్నాన్ని చూస్తూ, "మడిసంటే అలా బందోబస్తుగా ఉండాలి- మా ఇంటిదీ ఉంది- తగలెయ్యనా?" ఆపుకోలేక పైకి అనేశాడు.

ఈ మాటను అప్పుడే దుకాణంలోకి వస్తున్న ఇంటావిడ విని, ఒక మేఘగర్జన చేసింది. చెంగయ్య వెనక్కుచూచి, గతుక్కుమని చతికల పడ్డాడు.

నాగరత్తం గుడిసె కొచ్చేసరికి గూడెం వాళ్ళందరు నిద్దర్లు పోతున్నారు. ఆ గూడేన్ని నల్లటి చీకటి కౌగిలించుకుంది. అక్కడక్కడ మేకపిల్లల మేమేలు. ఎక్కడెక్కడో కుక్కల మొరుగుళ్ళు వినిపిస్తున్నాయి. ఈపాటికి తనమామ గుడిసెకొచ్చి, తను లేకపోయేసరికి కోపంతో కుతకుతలాడుతుంటాడు; కూడుకూడ వండలేదు. ఏమైనా ఇవాళ తనకు తిట్లు, దెబ్బలు తప్పవనుకుంటూ వచ్చింది. తీరా గుడిసె కొచ్చేసరికి తనమామ జాడేలేదు. తడికకుకట్టిన తాడు వూడదీసి లోపలి కెళ్ళింది. కిరసనాయిలుబుడ్డి వెలిగించి, గబగబ కూడువండటం మొదలుపెట్టింది. ఏ కొద్దిపాటి అలికిడైనా, మొగుడొచ్చాడేమోనని బయటికొచ్చి తొంగి చూస్తోంది.

అన్నం వండటం ఐయింది, మాఁవ ఇంకా రాలేదు. పొద్దుటాల నూరిన గొడ్డుకారం ఉంది. సన్నబియ్యం వన్నం సచ్చినోడు ఆవురావురుమంటూ కుండెడు ఖాళీచేస్తాడు అనుకొంటూ తనలో తాను నవ్వుకుంది. ఆ నవ్వులోతన మాఁవ మీదున్న మమత వెల్లివిరిసింది. తెల్లారగట్ట తిన్నకూడు. ఈపాటివరకూ తిండితిప్పలు లేకుండా ఎక్కడెక్కడ బలాదూరు తిరుగుతున్నాడో? దమ్మిడీ సంపాదన లేక పోయినా, అయ్యగారికి నీటుకేం తక్కువలేదు. ఏ కల్లుపాకల దగ్గర పాతేసుకుపోయాడో?

సన్నబియ్యమన్నంలోకి వంకాయ కూరుంటే తన మాఁవ కెంతో యిష్టం! పాపం, తిరిగి తిరిగి ఆకలిగా ఉంటాడు; వంకాయ కూరకూడా చేస్తే బాగా తింటాడు అని దొడ్లోకి వెళ్ళింది. అప్పుడే చంద్రుడు ఎట్టగా పైకిలేస్తో జేవురునిండిన వెలుగులను విరజిమ్ముతున్నాడు. దొడ్లోని వంగమొక్కల్లో వెదికి వెదికి నాల్గు లేత వంకాయలు కోసింది.

కూర వండటం పూర్తి అయినా, నాగరత్తం మొగుడు రాలేదు. కూర, అన్నం వండేసరికి, కుండలోని నీళ్ళు బాగా సలసల కాగివున్నాయి. రెండుచెంబుల నీళ్ళు పోసుకొనేసరికి ప్రాణానికి ఎంతో హాయి అనిపించింది. షావుకారిచ్చిన సబ్బుతో వళ్ళురుద్దుకుంది. సబ్బువాసనలువంటిని పులుముకున్నాయి ఆడొచ్చి తన్ను గట్టిగా కావులేసుకొని, ఈవాసనలు చూచి ఇదైపోతాడు. మనస్సు ఆధ్యాస వైపు మళ్ళేసరికి వళ్ళు గగుర్పొడిచింది, గుడిశ బయటి కొచ్చింది. తెల్లటి వెన్నెలతో బయటంతా విరగ్గాచిన మల్లిపందిరిలా వుంది. ఆ వెన్నెట్లో గాలి చల్లగా వంటికి తాకుతుంటే, ప్రాణం ఎక్కడెక్కడికో ఎగిరిపోతోంది. తల్లోనిపూలు, వంటికి పూసుకున్న సబ్బువాసనలు, నిశ్శబ్దం, చక్కదనాలమారి చంద్రుడు, దక్షిణపుగాలి, కసకస లాడుతున్న నాగరత్తం వయస్సు- ఇవన్నీ దాని మనస్సును మావగాడి ఆలోచనలతో నింపేశాయి. వాడికోర మీసాలు, జులపాలజుట్టు, కండలు తిరిగిన శరీరం, చేతిలోని బాణాకఱ్ఱ - ఈ వేషమంతా దాని కండ్లెదుట మెదిలి, చక్కలిగింతలు పెట్టింది.

కుక్కిమంచంతెచ్చుకొని, గుడిశముందు చింతచెట్టు కింద పడుకొంది. చెట్టుకొమ్మల సందుల నుండి ముదురు వెన్నెలలు చెదిరి దానిమీద పడుతున్నాయి. చల్లగాలితాకి చింతపూలు జలజల మీద రాలుతున్నాయి. నాగరత్తం ఒక పువ్వును చేతితో నలిపి వాసన చూచింది; వగర వాసన వచ్చింది.

ఎందుకో వెంకాయిగాడు జ్ఞప్తికొచ్చాడు. ఇందాక ఊళ్ళోనుండి గూడేనికొస్తుంటే, చీకట్లో చింతచెట్టు చాటునుండి వచ్చి, గట్టిగా వాటేసుకున్నాడు. వణుకుతున్న గొంతుతో "ఏమైనా సరే, ఇప్పుడుతప్పదే నాగులు" అంటూ వణుకుతున్న పెదాల్ని తన చెంపలకు ఆనిచ్చాడు. విడిపించుకోవాలని బ్రహ్మ ప్రయత్నం చేసింది కాని, వాడు పట్టినపట్టు సడలనియ్యలేదు.

"నీకు దన్నం పెడతా వదలరా వెంకాయీ! నేను చెప్పేది వినరా - నేను ఇయాలివరకూ ఎక్కడా చెడలా - నిప్పులాంటిదాన్ని - నా మావకు అన్యాయం సేయలేను.... నీకు చెల్లిలాంటిదాన్ని..... వదలరా వెంకాయి...." అని తాను జాలిగా వేడుకొంది.

ఈమాట వెంకాయి గుండెలమీద చెరనాకోలలాగా మోగింది. పట్టువిడుస్తు, "మరేంటి నంజవేసాలు? మనసున్నదానిలా బెమతలు వొలకపోసేదానివి" అంటూ నెమ్మదిగా గొణిగాడు.

"మరి నీవు పడిసస్తుంటే ఏం చెయ్యనురా?" నీళ్ళు నమిలింది.

"సస్తుంటే" - ఏదోఅనబోయి, "ఛ! పోవే, నంజకానా-" అని, చీకట్లో దూసుకుపోయాడు.

అంత తేలికగా వదలుతాడనుకోలా, ఆడి మంచితనం తలుచుకుంటే తనకళ్ళు చెమ్మగిల్లాయి.

గుడిసె ముంగిటనుండి "ఏయ్ నాగులూ! ఎక్కడ సచ్చావే?" అంటూ నాగరత్తం మొగుడు గొంతు విన్పించింది.

వాడిగొంతు వినగానే దానికి పట్టుచీర కట్టుకున్నంత సంబరమైంది.

"నా దేర్నం పాడుగాను వీడొచ్చి ఎంతసేపైందో!" అనుకుంటూ లేచివెళ్ళింది.

"ఇంతసేపుదాక ఎక్కడెక్కడ తిరుగుతున్నావు? పద పద కూడు పెట్టుతా-" అంది.

"కూడొద్దు; నీ మాడొద్దుగాని - చిల్లరడబ్బులుంటే పడేయ్. ఉన్న డబ్బులన్నీ ఆ సత్తిగాడు

గుంజుకున్నాడు. జూదంలో పెద్ద మొనగాడి ననుకుంటున్నాడు. ఇప్పుడు మన తఢాక చూపించి, వాడి పొగరణచాలి'' అంటూ మీసం మెలేశాడు.

"ఇప్పుడేం జూదం! కూడుతిని తొంగోక - ఐనా నా దగ్గర ఎఱ్రనేగానికూడ లేదు'' అంటూ లోపలికి దోవ తీసింది.

"వెధవ నంజవేషాలు వేయక, డబ్బులిస్తావా లేదా?'' రెట్టించి అడిగాడు.

"లేవని సెప్పటంలా?'' అంటూ కుండలోకూడు మూకుట్లో పెడుతోంది.

వాడసలు జూదంలో డబ్బులుపోయి వచ్చాడు; సందకాడ త్రాగిన కాపుసారాకైపు ఇంకా మిగిలివుంది. దీని పెడసరం మాటలు వినేసరికి, వాడికి అరికాలి మంట నడినెత్తి కెక్కింది; కుడికాలు జాడించి నాగరత్తం నడ్డిమీద ఒక్క తన్ను తన్నాడు. అది 'అమ్మో' అంటూ ముందుకు పడింది. ముందుకు పడ్డదానిమీ పీడుపడి, రొంటిన వున్న రూపాయి బిళ్ళ వూడలాక్కున్నాడు.

"మరేదగా అడుగుతే మాట వినవేం - మక్కెలు విరగ్గొట్టాలేం-'' అంటూ బయటికి దూసుకుపోబోయాడు.

నాగరత్తం ఒక్క వుదుటున వాడి కెదురొచ్చి, వాడ్ని వాటేసుకొని ఇలా అంది:

"తీసుకుంటే తీసుకున్నావులే మాఁవా - నామాట విని బువ్వతిను. పొద్దుటాల తిన్నకూడు - సన్నబియ్యం వొన్నం, వంకాయకూర వండాను నీకు ఇట్టం అని. బువ్వ తిని తొంగో. జూదం రేపు ఆడుకుందువులే - అర్ధరాతిరికాడ ఏడికి పోతావు మాఁవా-''

"సీ! ఏడుపుమొగందాన! అడ్డులే-'' అంటూ దాన్ని ఒక్కతోపు తోసి, బయటికి పోయాడు.

నాగరత్తం తడికకు జారిగిలపడి ఏడుస్తూ కూర్చుంది.

అదే రాత్రి, అదేసమయాన-

గొడ్లకు మేతవేస్తూ, "నాగులు, ఇవాళ కూడా తప్పించుకుంది. ఏమైనాసరే దాన్ని రేపు వదలకూడదు'' అనుకున్నాడు చలపతి.

* * *

వెంకాయి గూడ్సుబండికి పచ్చదీసం చూపిస్తూ, నాగరత్తం తిరస్కరణను తల్చుకొని బరువుగా నిట్టూర్చాడు.

* * *

రామారావు దీపంముందు కూర్చుని చదువుతున్నాడన్న మాటేగాని, ఒక్క అక్షరం ముక్కకూడా బుఱ్ఱకెక్కడంలేదు. పేజీల్లో నాగరత్తం పూలగుత్తిని అందుకోటానికి ఎగురుతోంది...... చిలిపి నవ్వులు నవ్వుతోంది..... కళ్ళుత్రిప్పుకుంటూ వయ్యారంగా నడుస్తుంది... అర్థంకాని తియ్యటి బాధలో సతమత మౌతున్నాడు.

* * *

షావుకారు కొడుకు సుబ్బారాయుడు సినిమా డేరా కాడ నాగరత్తం వచ్చిందేమోనని వెతుకుతూ,

అటుఇటు పచార్లు చేస్తూ, వాళ్ళయ్యకు తెలిసినవాళ్ళు కనిపిస్తే మొగం చాటు చేసుకుంటుంన్నాడు.

* * *

షావుకారు చెంగయ్య వాకిటున్న భార్యకు అన్నం వడ్డిస్తూ - నాగరత్తం ధ్యాసలో ఉన్నాడు కాబోలు - "ఇంకాస్త కందిపచ్చడెయ్యమంటావా నాగులూ?" అని, నాలిక కొరుక్కున్నాడు. భార్య ఉరిమురిమి చూసింది.

* * *

జూదం ఆటలో వచ్చిన దెబ్బలాటలో సత్తిగాడు విసిరిన పెద్దరాయి తలకు తగిలి, - కారుతున్న రక్తంతో, జారుతున్న మతితో - కిందపడి గిలగిల కొట్టుకుంటున్నాడు, నాగరత్తం మొగుడు.

* * *

నిశ్శబ్దంగా నిదురపోతున్న మాలగూడెంలో ఎక్కడో దూరంగా కుక్కలు మొరుగుళ్ళు - ఆగి ఆగి వస్తోన్న నాగరత్తం ఏడ్పు ఎక్కిళ్ళు - చెంపలమీద ఆరిపోయిన కన్నీటి చారికలు, నాగరత్తాన్ని నవుకీలు చేస్తూ వున్నట్లుగా తీతువుల కూతలు!

గుండెల్లో అలుముకున్న విషాదంలాగా చింతచెట్టు చీకటిగుబురు!

నల్లకుక్కకు పరమైన సన్నబియ్యపన్నం, మొక్కవోయిన చంద్రుని దిగాలు మొగం! చెరిగిన కలలాగా విరిగిన అలలాగా భంగపడిన నాగరత్తం వలపు!

- ఆంధ్రపత్రిక వారపత్రిక, *1958*

★